ప్రజాపాలన ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్ష చేస్తున్న ఉపకమిషనర్ వంశీకృష్ణ

శేరిలింగంపల్లి: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఈ నెల 28 తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శేరిలింగంపల్లి సర్కిల్ స్పెషల్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ వాణిశ్రీ, డిప్యూటీ కమిషనర్ జి.రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రజాపాలన ఏర్పాట్లపై అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లలలో నాలుగు కేంద్రాల చొప్పున 12 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 28 వ తేదీ నుంచి వచ్చే 6 వ తేదీవరకు (డిసెంబర్ 31, జనవరి 1వ తేదీ మినహాయించి) ఈ సెంటర్స్ కొనసాగుతాయని, ప్రతి రోజు ఒక్కో కాలనీ వారు దరఖాస్తులు అందజేసేందుకు రావాలని సూచించారు.

చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో..

హఫీజ్‌పేట్ : రేపటి నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన కార్యక్రమంపై మంగళవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఉపకమిషనర్ వంశీకృష్ణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు కావలసిన దరఖాస్తులు, ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ సెంటర్ల ఇంచార్జి అధికారులు, ఏఎంసీ సురేష్, ఈఈ శ్రీకాంతి, ఏసీపీ రాజ్‌కుమార్, ఏఎంహెచ్ఓ డాక్టర్ కార్తిక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ వాణిశ్రీ, డిప్యూటీ కమిషనర్ జి.రజనీకాంత్‌రెడ్డి తదితరులు

గోపన్‌పల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత





గోపన్‌పల్లి సర్వే నంబర్ 34లో కూల్చి వేతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు

ఎన్నికల సమయంలో గుట్ట చుట్టూ ఉన్న స్థలం కబ్జా

గచ్చిబౌలి: అక్కడ గజం విలువ లక్షకు పైనే ఉంటుంది. రూ.30 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రి నిర్మాణాలు వెలిశాయి. ఎన్నికల వేళ ఎవరూ పట్టించుకోరనే ధీమాతో కొందరు యథేచ్ఛగా స్థలాలను కబ్జా చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు మంగళవారం ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను కూల్చివేశారు. గోపన్‌పల్లిలో సర్వే నెంబర్ 34లో ఉన్న గుట్ట కబ్జాదారులకు వరంగా మారింది. స్మశానవాటిక సమీపంలో వెయ్యి గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.ఈ గదులను రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ రాము హెచ్చరించారు.

'ప్రజాపాలన' గురించి అవగాహన కల్పించాలి

మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: ప్రజాపాలనపై విస్తృత ప్రచారం చేయాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణ, అవగాహన సమావేశంను మంగళవారం మున్సిపల్ సమావేశం మందిరంలో నిర్వహించారు.ఈ సమావేశంలో కమిషనర్ జ్యోతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడుతూ కార్యక్రమం విధివిధానాలను సభ్యులకు వివరించారు. ఈ నెల 28 నుంచి రోజు ఉదయం 8.00 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి 2.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు వార్డు సభలు నిర్వహిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన ల్పించాలన్నారు.





వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి తదితరులు

ఘనంగా దత్త జయంతి



పూజలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

రాయదుర్గం: దత్త జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. అలాగే టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో కాకడ హారతితో వేడుకలను ప్రారంభించారు. అనంతరం షిర్డీ సాయిబాబా, వినాయకుడు, దత్తాత్రేయస్వామి వార్లకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అనఘాదేవి వ్రతం, సాయి సచ్చరిత్ర పారాయణం చేశారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దత్తాత్రేయ స్వామి పల్లకి సేవ, రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీలో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి బీహెచ్ఈఎల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీలోని సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సింధు ఆదర్శ్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.

జేపీఎన్‌నగర్ కాలనీలో..

మియాపూర్ : మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ కాలనీ సాయిబాబా ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్‌గౌడ్, సాంబశివరావు, దినేష్, రవీందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతి నెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0 ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 3 చోట్ల జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం, పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ పెన్నార్ ఇండస్ట్రీస్, శేరిలింగంపల్లి అల్యూమినియం ఇండస్ట్రీస్‌లలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



ప్రేమ్‌నగర్ బస్తీలో అంతర్గత రోడ్ల దుస్థితి



ఎత్తుపల్లాలుగా ఉన్న రోడ్లు

అధ్వాన రోడ్లు.. రాకపోకలు ఎలా..?

- ప్రేమ్‌నగర్ బస్తీ రోడ్లు గుంతలమయం
- రోడ్లపై మురుగునీరు



రోడ్లపై మురుగునీరు

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కనీసం రాకపోకలకు వీలు లేకుండా ఉన్నాయి. బస్తీలో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించడం లేదు. ఇక్కడ ప్రధానరోడ్లు తప్ప అంతర్గత రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. కొన్ని రోడ్లు మట్టి కుప్పలతో ఎత్తు పల్లాలుగా మారాయి. మరోచోట డ్రైనేజీ నీరు చేరి నడవడానికి వీలు లేకుండా ఉండడంతో రోడ్డుపై నడవాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు ప్రబలాయి. డివిజన్ పరిధిలో అధిక జనాభా నివాసముండే బస్తీలు ఇవేనని కనీస వసతులపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

సమస్యలు ఇవే..

- ప్రేమ్‌నగర్ బస్తీలో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి.
- డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రావడంతో రోడ్డు గుంతలమయంగా మారింది.
- రోడ్లపై పేరుకుపోతున్న మురుగుతో దోమలు ప్రబలి విష జ్వరాలు వస్తున్నాయి
- హఫీజ్‌పేట్ రైల్వేట్రాక్ పక్కన రాత్రి సమయంలో ఆకతాయిలు గంజాయి, మద్యం తాగి స్థానికులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు.
- బస్తీలలో ప్రతి ఇంటికి శాశ్వత ఇంటి నంబర్ కేటాయించాలి
- వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాలలో ఇబ్బందులు పడుతున్నామని, రైల్వే ట్రాక్ సమీపంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

రోడ్లు వేయాలి



ప్రేమ్‌నగర్ బస్తీలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక నిధులతో సీసీ రోడ్ల పనులు చేపట్టాలి. పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌ను కూడా నిర్మించాలి.

– పార్థసారధి, ప్రేమ్‌నగర్‌వాసి

బస్తీలో పోలీసు నిఘా పెంచాలి



ప్రేమ్‌నగర్ బస్తీలో ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నాం. హఫీజ్‌పేట్ రైల్వే ట్రాక్ దగ్గర ఉన్న బస్తీ ప్రాంతంలో రాత్రి సమయాలలో కొంతమంది యువకులు మద్యం, గంజాయి తాగి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కార్డన్ సెర్చ్‌లో కూడా మా సమస్యలను వివరించాం. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే వీధి దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో బాటు పోలీసులు బస్తీలో నిఘా పెంచాలి.

–సూరిబాబు, ప్రేమ్‌నగర్

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిందని పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఆది, సోమవారాల్లో నిర్వహించిన తనిఖీల్లో 15 మంది పట్టుబడగా వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ. వెయ్యి జరిమాన విధించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ దత్తాత్రేయ కాలనీకు చెందిన లక్ష్మీదుర్గ అనే విద్యార్థినికి కళాశాల ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం షిరిడి సాయిబాబా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష్మీదుర్గకు 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వాసుదేవరావు, వరలక్ష్మీ పాల్గొన్నారు.

హోం హెల్త్ ఎయిడ్ కోర్సు ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో హెల్త్ కేర్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిది వారాలు నిర్వహించే హోమ్ హెల్త్ ఎయిడ్ కోర్సుకు 40 సంవత్సరాల లోపు వారు, 10వ తరగతి చదివిన వారు అర్హులని తెలిపారు. జనవరి 1వ తేది నుంచి మొదటి బ్యాచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రి, కుముదినిదేవి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, సెల్ నెం. 9989700665లో సంప్రదించాలని కోరారు.

శుభాకాంక్షలు

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన జగదీశ్వర్‌గౌడ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించిన సందర్భంగా ఆయనను మంగళవారం సింధం శ్రీకాంత్, పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ జగదీశ్వర్‌గౌడ్ నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, సదా మహేష్, నర్సింగరావు, రాము, రషీద్, ఆంజనేయులు, మహేష్‌గౌడ్, రాజిరెడ్డి, సుందరం, స్వామి పాల్గొన్నారు.



నేత్రపర్వం ..భరతనాట్యం



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్‌మేళాలో భాగంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రదర్శన ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆంఫి థియేటర్‌లో రష్మీ సచ్చిదానంద శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు అనయ, ఆకాంక్ష, అంజలి, నక్షత్ర, రాధా, సాయినేహ, సంభవిలు మల్లరి నాటరాగం, గురులేఖ, కృష్ణ అలరిపు, కనడ జతిస్వరం, మార్గాళి తింగల్ , శివపదం తదితర అంశాలను ప్రదర్శించారు.

6 పథకాలు అర్హులందరికీ అందాలి



పీజేఆర్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజల సంక్షేమం అని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాలు ప్రతి కుటుంబానికి అందేలా అందరం ముందుకు సాగుదామని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ బస్తీలో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులకు సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, సీనియర్ నాయకులు సాంబశివరావు, డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాస్, గోపాల్, ప్రభాకర్, శశి, రవి, సంగమేష్, వెంకటేష్, రాజు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

గోసంతతిని అభివృద్ధి చేయాలి

పటాన్‌చెరు: గోసంతతిని అభివృద్ధి చేసి గోవు ద్వారా కలిగే లాభాలను సద్వినియోగం చేసుకోవాలని గోశాల చైర్మన్ సోహన్‌లాల్ దయిమా పేర్కొన్నారు. బీరంగూడ భ్రమరాంబమల్లికార్జున స్వామి గోశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రత్యేక గోపూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవు ఉన్న పరిసరాలు రోగ నిరోధక ప్రాంతాలుగా ఉంటాయన్నారు. ఆవుపాలు తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో కొంతమంది రైతులు గోఆధారిత వ్యవసాయానికి మక్కువ చూపుతున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ పురపాలక అధ్యక్షుడు పాండురంగారెడ్డి, వార్డు సభ్యుడు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల రమేష్ ,నాయకులు లింగంగౌడ్, భాస్కర్‌రెడ్డి, దుష్యంత్‌రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు విఠల్, భూపాల్‌రెడ్డి, సుఖదేవ్ జోషి, రాజేందర్ తివారి, తిరుమలరెడ్డి లక్ష్మణ్, జయకృష్ణారెడ్డి ఉన్నారు.

బలేశ్వర్‌నాథ్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే



బలేశ్వర్‌నాథ్ సన్నిధిలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం నేపాల్ రాజధాని ఖాట్మండు సమీపంలోని చంద్రగిరి పర్వతాలపైన గల బలేశ్వర్ మహాదేవ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, పాండు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర

పటాన్‌చెరు టౌన్: దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం పోచారం గ్రామంలో నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ జగన్ శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల్ ప్రెసిడెంట్ సుధాకర్‌గౌడ్, సర్పంచ్ జగన్, రామరాజు, భాస్కర్‌గౌడ్, భుజంగరెడ్డి, రాజు, లింగం, నాయకులు, కార్యకర్తలు, కెఎస్‌జీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మండల పూజ



అంబారీపై అయ్యప్ప స్వామి ఊరేగింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ కాలనీలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం రాత్రి మండల పూజ సందర్భంగా అయ్యప్ప విగ్రహాన్ని కాలనీలో ఊరేగించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు దీపాలతో స్వాగతం పలికారు. కేరళ కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక భజనలు చేశారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద బాణసంచా కాల్చారు.

గో కలర్స్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్స్ సందడి



సాక్షి, సిటీబ్యూరో: గో ఫ్యాషన్ బ్రాండ్ ఆధ్వర్యంలో గో కలర్స్ ఆవరణలో నిర్వహించిన ఈవెంట్‌లో సామాజిక మాధ్యమాల్లో ఇన్‌ఫ్లుయెన్సర్లుగా పేరొందిన సిటీ అమ్మాయిలు మెరిశారు. ఈ ఇన్‌ఫ్లుయెన్సర్ మీట్‌లో భాగంగా యువతకు స్ఫూర్తి పంచే అమ్మాయిల్ని సంస్థ అభినందించింది. ఈ సందర్భంగా బ్రాండ్ దుస్తులను ధరించిన యువత పాప్, బాలీవుడ్, జాజ్ సంగీత రీతుల నేపథ్యంలో ఆడుతూ పాడుతూ సందడి చేశారు.

కేలండర్ ఆవిష్కరణ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నూతన సంవత్సరం 2024 కేలండర్‌ను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వాసవీమాత టెంపుల్ చైర్మన్ పూల కోటేశ్వరరావు, ఐవిఎఫ్ యూత్ స్టేట్ ప్రెసిడెంట్ కట్ట రవి, పూలవాణి, పృథ్వీ కుమార్, నరేష్, ఉష రాణి, రఘు వంశీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గాంధీని కలిసిన ఎంపీ బీబీ పాటిల్



గచ్చిబౌలి: ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం వివేకానంద నగర్‌లోని నివాసంలో గాంధీని కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు.

ఎమ్మెల్యేకు కాలనీవాసుల సత్కారం



గాంధీని కలిసిన అసోసియేషన్ సభ్యులు

మియాపూర్ : మియాపూర్ హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గాంధీని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అధ్యక్షులు దేవేందర్‌రావు, ఉపాధ్యక్షులు సివి.చారీ, జనరల్ సెక్రటరి దశరథ్‌రావు, జాయింట్ సెక్రటరి సురేష్, ట్రెజరర్ రమేష్‌చంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరి సత్యం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీలో మంగళవారం కార్పొరేటర్ పుష్ప నగేష్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రధానంగా డ్రైనేజ్ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కార్పొరేటర్‌ను స్థానికులు కోరారు.



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప నగేష్